సంక్షేమ ప్రదాత సీఎం జగన్



ప్రభుత్వ పథకాలను తెలిపే కరపత్రాలను లబ్ధిదారుకు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: పేదలందరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరికీ పథకాలందిస్తూ సంక్షేమప్రదాతగా నిలిచారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 86వ వార్డు వుడా ఫేజ్–6, ఎన్టీఆర్ నగర్, జూబ్లీ నగర్ పరిధిలో ఆయన పర్యటించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు అక్కడికక్కడే తెలియజేసి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న హామీలను పూర్తిగా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం భారీ మెజారిటీతో గెలిచి, మరెన్నో సంక్షేమ పథకాలతో చరిత్రను తిరగరాసే స్థాయికి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఉండనుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్, శ్రీనివాస్‌పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు, యోహాన్, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, గుండాసు రాజు, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, పోలీస్ శాఖ, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను నిర్మూలిద్దాం

జోనల్ కమిషనర్ సింహాచలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: సీజనల్ వ్యాధుల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. 66వ వార్డు కైలాసనగర్‌లోని మహిళా రైతు బజార్ వద్ద నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ ఇళ్లల్లో, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. వారానికోసారి ప్రతి ఇంట్లో డ్రైడే పాటించాలన్నారు. నేలబావుల్లో డెంగ్యూ దోమల నివారణకు గంబూసియా చేపలను వదిలిపెట్టారు. స్వచ్ఛసర్వేక్షణ్ 2023 పోటీల్లో ప్రజలంతా భాగస్వాములై విశాఖ నగరానికి మొదటి ర్యాంకు వచ్చే విధంగా సహకరించాలని కోరారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులను, వస్తువులను వినియోగించరాదని, వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ, నారతో తయారు చేసిన సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం

సచివాలయ అడ్మిన్లకు జెడ్సీ ఆదేశం



సమావేశంలో పాల్గొన్న అడ్మిన్ సెక్రటరీలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: గాజువాక జోన్‌లో ఆస్తిపన్ను వసూళ్లను సచివాలయ అడ్మిన్లు వేగవంతం చేయాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఆదేశించారు. ఆస్తిపన్నులు, నీటి చార్జీల వసూళ్లపై సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరం సెప్టెంబర్ నాటికి పూర్తి కానున్నందున పన్నుల వసూళ్లలో ప్రగతి సాధించాలని ఆదేశించారు. సెప్టెంబర్ దాటితే పన్ను బకాయిలపై 2 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్న విషయాన్ని భవన యజమానులకు వివరించాలని సూచించారు. వడ్డీ లేకుండా పన్ను చెల్లించుకునే విషయాన్ని వారికి అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. సెప్టెంబర్ లోపు పన్ను చెల్లించుకోవడం వల్ల వడ్డీ ఉండదని తెలిపారు. పన్ను బకాయిలపై అందర్నీ అప్రమత్తం చేయాలని, లేదంటే జప్తులు ఉంటాయన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. మ్యాపింగ్ విషయంలో రీ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, లేనిపక్షంలో సంబంధిత అడ్మిన్లపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జోనల్ రెవెన్యూ అధికారి సీహెచ్.రామనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సుభాన్, శివ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14న ఏపీఐఐసీ ఐలాలో రక్తదాన శిబిరం

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా మరియు లఘు ఉద్యోగ భారతి సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) అధ్యక్షుడు ఎస్.పాండురంగ ప్రసాద్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), లఘు ఉద్యోగ భారత్ విశాఖపట్నం అధ్యక్షుడు ఎ.రమేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఐలా భవనంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న శిబిరాన్ని పారిశ్రామిక వేత్తలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి'

అగనంపూడి: పేద ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ కోరారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మీద పవన్‌కు ఎందుకంత ఉక్రోషమో అర్థం కావడం లేదన్నారు. ఇచ్చిన మాట కోసం పాటుపడుతున్న జగన్ విషయంలో అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలు క్షమించరని పవన్ తెలుసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి చిన అప్పారావు తదితరులు మాట్లాడారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా సాయం అందిస్తున్న చందు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులోని ఒక మృతుని కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని ఆ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు శుక్రవారం అందజేశారు. టీవీఎస్ కాలనీకి చెందిన వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయనకు వైఎస్సార్ బీమా మంజూరైంది. దీంతో ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10వేలను మృతుని భార్య స్వాతికి కార్పొరేటర్ అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కొణతాల రాము, జనార్థన్, గౌరునాయుడు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిగీతాలాపన, నృత్యాలతో అలరించిన విద్యార్థులు



కీర్తనలు ఆలపిస్తున్న నాట్యపరిమళ అకాడమీ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: వేంకటేశ్వర స్వామి శ్రావణ సంగీతోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాట్యపరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు శ్రీవారి గీతాలను ఆలపించి అలరించారు. మయూరి నృత్య నికేతన్ విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలలకు చెందిన విద్యారులు ఈ ఉత్సవాల్లో నాట్యం, సంగీతం, ఇతిహాసాలు, పురాణ గాథలపై ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 వరకు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతీ తెలుగువారు పోరాటానికి సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 911వ రోజు శుక్రవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులను మోసం చేస్తోందని, కార్మికులకు పని లేకుండా చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఎంతటి త్యాగానికైన సిద్ధంగా ఉన్నామని, కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికులకు నిలిపివేసిన అలవెన్సులు వెంటనే చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. కార్మికులు అలవెన్సుల కోసం శుక్రవారం మధ్యాహ్నం ఉక్కు పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు గతంలో ఇచ్చే ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్‌లను నిలిపివేయడం అన్యాయమన్నారు. హెచ్ఆర్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భెల్‌లో ఎన్నికలకు 17న సమావేశం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో త్వరలో నిర్వహించనున్న గుర్తింపు యూనియన్ ఎన్నికలను పురస్కరించుకుని సంస్థలోని అన్ని కార్మిక సంఘాలతో ఈ నెల 17వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో ఎన్నికల తేదీని ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీహెచ్‌పీవీ భెల్‌లో విలీనం అయిన తర్వాత జరగనున్న 4వ ఎన్నికలని కార్మికవర్గాలు తెలిపాయి.

అధికారులను బెదిరించిన వ్యక్తిపై కేసు

పెదగంట్యాడ: సివిల్ సప్లైస్ అధికారులను బెదిరించిన ఓ వ్యక్తిపై న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు పి.బిందు. కె.లక్ష్మీ ప్రసన్నకుమారి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తనిఖీ చేశారు. ఆ ఇంట్లో 150 కిలోల బియ్యాన్ని గుర్తించి, ఇంటి యజమానిపై కేసు నమోదు చేస్తున్న సమయంలో విజయ్‌కుమార్ అనే వ్యక్తి అడ్డుకుని, వారి విధులకు ఆటంకం కల్పించాడు. మహిళా అధికారులని కూడా చూడకుండా ఇద్దరినీ నెట్టి వేయడంతో వారు ఆందోళన చెందారు. వెంటనే అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ టి.కృష్ణకు సమాచారం ఇవ్వడంతో, ఆయన జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జేసీ సూచనల మేరకు న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిల్లర దొంగల హల్‌చల్



పార్కు గోడపై ఇనుప గ్రిల్స్ చోరీ అయిన దృశ్యం

పెదగంట్యాడ: చిల్లర దొంగలు చెలరేగిపోతున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. పార్కుల్లో రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ సైతం తొలగించి తీసుకుపోతుండటంతో అంతా విస్తుపోతున్నారు. వివరాలివి.. వుడా డబుల్ రోడ్డులో పెద్ద ఎత్తున పార్కులను అభివృద్ధికి అధికారులు గతంలో చర్యలు చేపట్టారు. రోడ్డు మధ్య వీటిని ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ గోడలు నిర్మించారు. ఆ గోడలపై ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వీటిపై చిల్లర దొంగల కన్ను పడింది. రాత్రి వేళల్లో ఎవరూ లేని సమయంలో ఆ గ్రిల్స్ తొలగించి ఎత్తుకుపోతున్నారు. వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. వంటిల్లు జంక్షన్ నుంచి కేకేఆర్ వాటర్ ప్లాంట్ వరకు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ గ్రిల్స్ చోరీకి గురవుతున్నాయి. దొంగలు ప్రతి రోజూ ఇక్కడ చోరీలకు పాల్పడుతుండడంతో స్థానికులు హడలిపోతున్నారు. అటు వుడా అధికారులు గానీ, ఇటు జీవీఎంసీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క పోలీసులు రాత్రి వేళల్లో పహారా కాస్తున్నా దొంగలు మాత్రం తమ పని చాకచక్యంగా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అక్కడ నిఘా వేసి దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్వాసిత కాలనీల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వినతి



ఎస్ఈ మహేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లో విస్తరించిన ఉన్న అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అగనంపూడికి చెందిన నాయకులు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్‌ను కోరారు. నగరంలోని ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి, వినతిపత్రం సమర్పించారు. 20 పునరావాస కాలనీలు, 40వేల పైచిలుకు జనాభా ఉన్న అగనంపూడిలో ఇండోర్ సబ్‌స్టేషన్ ఉన్నా, అపార్టుమెంట్‌వాసుల అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతోందని, నిర్వాసిత కాలనీలకు విద్యుత్ వెతలు తప్పడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు బి.సత్యనారాయణ, ఎం.వి.రమణ, వి.నారాయణరావు, ఎ.సత్యనారాయణ ఉన్నారు.

చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచాలి



సంఘీభావం తెలుపుతున్న వీవర్స్ ఫెడరేషన్ సంఘం నాయకులు

పెదగంట్యాడ: చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతలపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, నేత నేసే మహిళా కార్మికులకు కూడా నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలని కోరారు. సొసైటీల్లో నిల్వ ఉన్న వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేత కార్మికుల సమస్యలపై ఈ నెల 27న పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి చేనేత 18 కులాలకు చెందిన వారు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కర్ర రవి, నాలి అప్పారావు, కొప్పల రామ్‌కుమార్, చిక్కా సత్యనారాయణ, మాడెం సూరి అప్పారావు, నామాని, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ హేమలత




డాక్టర్ రమేష్‌బాబు నుంచి నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ హేమలత

పెదగంట్యాడ: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ హేమలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని ప్రాంతీయ కంటి ఆస్పత్రి నుంచి బదిలీపై వచ్చిన ఆమె పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్‌బాబు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఇక్కడ వైద్యాధికారిగా పని చేసిన డాక్టర్ అన్నపూర్ణ నగరంలోని ఛాతీ ఆస్పత్రికి బదిలీ అయ్యారు.

రంగుల కళ

- జాలువారిన అద్భుత చిత్తరువులు
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు



మత సామరస్యాన్ని కాపాడుకుంటాం.. అన్నదమ్ములుగా మసులుకుంటాం..



మువ్వన్నెల్లో మన విశ్వం



పాఠశాలే ప్రగతికి తొలి మెట్టు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గోపాలపట్నం: వారి ఆలోచనల్లో ఎన్నో రూపాలు... ఆ రూపాలను రంగులతో అద్భుతంగా ఆవిష్కరించారు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలు ఉత్సాహంగా సాగాయి. వారి రంగుల కళలకు రూపాలుగా నిలిచాయి. భూమి ఆకాశం అంతా మాదే ..అంతరిక్షంలో దూసుకు పోతామని జాతీయా జెండాకు వందనం సమర్పిస్తున్న ఓ విద్యార్థి... మత సామరస్యానికి ప్రతీక... గాంధీతాత సాక్షిగా రేపటి భవిష్యత్తు అంతా మా భుజాలపై మోస్తామని భరోసా ఇస్తున్న విద్యార్థులు...ఈ స్కూలే మాకు పునాది... ఆకాశమే మాకు హద్దు... హిమాలయాలే మాకు స్ఫూర్తి అంటున్నారు ఈ చిన్నారులు... భగత్ సింగ్‌కు వందన సమర్పన...శాంతితోనే సామరస్య జీవితం.. మువ్వన్నెల జెండా విశ్వానికి ఆదర్శం అంటూ విద్యార్థులు గీసిన చిత్రాలు ముచ్చట గొలిపాయి.

ఉక్కునగరంలో ఓపెన్ జిమ్‌లు



ఉక్కు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

రూ.40 లక్షలతో 8 ప్రాంతాల్లో ఏర్పాటు

ఉక్కునగరం: ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని గమనించిన జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో 8 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. జీవీఎంసీ 78వ వార్డులో కార్పొరేటర్ నిధులు రూ.40లక్షలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. కార్పొరేటర్ డాక్టర్ గంగారావు మాట్లాడుతూ ఉక్కు స్టేడియం, త్రిష్నా మైదానం, అంబేడ్కర్ పార్కు, మహాత్మాగాంధీ పార్కు, గుర్రం జాషువా పార్కు, సెక్టార్–11 పార్కు, సీఐఎస్ఎఫ్ కాలనీ, అగనంపూడి రహదారిలోని వాకింగ్ పార్కులో ఈ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని జిమ్‌ల పనులు పూర్తి కాగా.. ఈ నెలలో మిగిలినవి పూర్తి కానున్నాయన్నారు. త్వరలో అన్ని జిమ్‌లను అధికారికంగా ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రజల ఆరోగ్యం కోసం..

ప్రజల ఆరోగ్యం కోసం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ ఆధ్వర్యంలో జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఉక్కునగరంలోని అన్ని వయసుల వారికి అనువుగా పరికరాలు సమకూర్చుతున్నాం. ఉద్యోగులు, పిల్లలు జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ బి. గంగారావు,
78వ వార్డు కార్పొరేటర్

ఫైనాన్షియల్ మార్కెట్‌పై అవగాహన



ప్రసంగిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

ఏయూక్యాంపస్: స్టాక్ మార్కెట్‌లో అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ సతీష్‌కుమార్ ఆర్య అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శుక్రవారం ఫైనాన్షియల్ మార్కెట్ సర్వీసెస్‌లో అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు, అపోలో హాస్పిటల్స్ అధినేత ప్రతాప్ రెడ్డిల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ సీనియర్ మేనేజర్ కె.రాజేశ్వర రెడ్డి స్టాక్ మార్కెట్, షేర్లు, ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్ తదితర అంశాలను వివరించారు. ఫండ్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సాంబమూర్తి ఇంటర్న్‌షిప్‌ల అందించే విధానాన్ని వివరించారు. మూలధనాన్ని ఏ విధంగా వినియోగించడవచ్చు, జ్ఞానాన్ని సంపదగా మార్చుకోవడం ఎలా అనే విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆచార్య ఎస్.సాంబశివ రావు, డాక్టర్ బి.సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆగస్ట్ 15 పరేడ్ రిహార్సల్స్ పరిశీలన



పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎస్పీ కృష్ణారావు

ఆరిలోవ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసులు పరేడ్ కోసం విశాఖపట్నం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. దీనిని శుక్రవారం ఆ జిల్లా ఎస్పీ కె.వి.కృష్ణారావు పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయనకు ఇక్కడి సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 15 వేడుకలు అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దాని కోసం కవాతు బాగా జరపాలని రిహార్సల్ చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. స్వాతంత్ర దినోత్సవం నాడు పరేడ్ ఆకట్టుకొనేలా రిహార్సల్ చేయాలని సిబ్బందికి సూచించారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఆర్ఐలు బి.రామకృష్ణారావు, కె.వెంకటరావు, ఎం.సతీష్, కె.అరవింద్ కిశోర్ పాల్గొన్నారు.